ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట 5
శనివారం 30 ఆగస్టు 2025

టోకెన్లు చిక్కినా.. యూరియా దొరక్క

- బారులు తీరిన అన్నదాతలు... గంటల కొద్దీ నిరీక్షణ
- అధికారుల కాళ్లు మొక్కే దాకా తెచ్చిన కష్టాలు 7

పాతమోటార్లకు మళ్లీ పని



కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. దీంతో ఇన్నాళ్లు మూలన పడేసిన బావి మోటార్లకు తిరిగి పనిపెట్టేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. బావుల్లో నీటి ఊట పెరగడంతోపాటు, వాగులు, చెరువుల్లో నీళ్లు చేరడంతో రైతులు తమ పాత మోటార్లను దుబ్బాక పట్టణానికి తీసుకొచ్చి మరమ్మతులు చేయించుకుంటున్నారు. వాగుల పరివాహక ప్రాంత రైతులు, ఇతర గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో మోటార్లను మరమ్మతులకు తీసుకురావడం దుబ్బాకలో కనిపించింది.

– దుబ్బాక, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి)

గణపతిని దర్శించుకున్న జగ్గారెడ్డి

జగ్గారెడ్డి కొడుకు దత్తు సాయిరెడ్డి ఆధ్వర్యంలో భారీ విగ్రహం ఏర్పాటు



సంగారెడ్డిలోని బైపాస్ రోడ్డులో ఉన్న కాంగ్రెస్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన గణపతిని దర్శించుకున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, కుమారుడు దత్తు సాయిరెడ్డి ఇతర నాయకులు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన గణపతిని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, కుటుంబ సభ్యులు శుక్రవారం దర్శించుకున్నారు. పట్టణంలోని బైపాస్ రోడ్డులో కాంగ్రెస్ కార్యాలయం వద్ద దత్తు సాయిరెడ్డి యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బొజ్జగణపయ్యకు జగ్గారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డిని యువకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జగ్గారెడ్డి, కూతురు జయారెడ్డి, అల్లుడు గుణచైతన్యరెడ్డి, కుమారుడు దత్తు సాయిరెడ్డి, కూన సంతోష్‌కుమార్, కిరణ్ గౌడ్, సునీల్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.



గణపతిని దర్శించుకున్న జగ్గారెడ్డి, కూతురు జయారెడ్డి, అల్లుడు గుణ చైతన్య రెడ్డి, కుమారుడు దత్తు సాయిరెడ్డి తదితరులు

భారీ వర్షం.. తీరని నష్టం

లోతట్టు ప్రాంతాలు, కాలనీల్లో నిలిచిన నీరు

రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీరు సిద్దిపేట పట్టణాన్ని ముంచెత్తింది. పట్టణంలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. పలు ఇళ్లలోకి, అపార్ట్‌మెంట్ సెల్లార్లలోకి, వ్యాపార సంస్థలు, దుకాణాల్లోకి వరద నీరు చేరింది. జిల్లాలోని పలు గ్రామాల్లో వరద కారణంగా పంటలు నీట మునిగాయి. వ్యవసాయ భూముల్లోకి వరద నీటితో పాటు భారీగా ఇసుక మేటలు చేరాయి. వర్షం వదిలినా బురద మిగలడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురువారం సృష్టించిన బీభత్సం నుంచి ప్రజలు ఇంకా తేరుకోవడం లేదు. మరో వైపు జిల్లాలోని పలు ప్రాంతాల్లో చెక్‌డ్యాంలు, చెరువులు పొంగిపొర్లు తుండటంతో రోడ్లపై వరద ఉధృతి ఇంకా కొనసాగుతోంది. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

- సిద్దిపేటలో కొనసాగుతున్న వరద ఉధృతి
- వ్యవసాయ భూముల్లో ఇసుక మేటలు
- అపార్ట్‌మెంట్ సెల్లార్లు, దుకాణాల్లోకి చేరిన నీరు
- ఎఫ్‌టీఎల్, సెట్‌బ్యాక్ లేకపోవడమే ప్రధాన కారణం!

సిద్దిపేట ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కోమటిచెరువు వరద ఉధృతి కారణంగా కాలనీల్లోకి నీరు చేరకుండా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచన మేరకు అధికారులు నర్సాపూర్ చెరువు మత్తడి పైభాగాన్ని తొలగించారు. దీంతో గంటల వ్యవధిలోనే ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు దిగువ ప్రాంతాలైన శనిగరం వంటి చెరువులకు వెళ్లేలా చేశారు. వరద నీరు వెళ్లినా పట్టణంలో జలమయమైన కాలనీలు ప్రస్తుతం బురద సమస్యతో విలవిలలాడుతున్నాయి. పలు లోతట్టు ప్రాంతాలు, ఖాళీ స్థలాల్లో ఇంకా వరద నీరు నిలిచిపోయింది. కోమటిచెరువు నుంచి వస్తున్న వరద నీరు కాలువలో ఎక్కడా ఆగకుండా వెళ్లేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పట్టణంలోని గోశాల కూడా బురదమయంగా మారడంతో అందులోని మూగజీవాలు ఇబ్బందులు పడుతున్నాయి.

కోమటిచెరువు కాలువ నుంచి ఉధృతంగా ప్రవహించి లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, అక్కడి కాలనీల్లోని అపార్ట్‌మెంట్‌ల సెల్లార్లలోకి, పలు ఇళ్లలోకి చేరిన వరద నీటిని మోటార్లు, బకెట్ల సహాయంతో ఎత్తిపోస్తున్నారు. హైదరాబాద్

మిగతా 8వ పేజీలో



సిద్దిపేటలోని కెనాల్‌లో ప్రవహిస్తున్న వరద ఉధృతి

నిబంధనలకు విరుద్ధంగా..

సిద్దిపేటలో ఆక్రమణలకు గురైన చెరువులు, కుంటల భూములను కొందరు తెలియక కొనుగోలు చేయడం వల్లే ఈ వరద పరిస్థితి తలెత్తిందని తెలుస్తోంది. లోతట్టు ప్రాంతాలు, ఎఫ్‌టీఎల్ (పూర్తి స్థాయి నీటి మట్టం), సెట్‌బ్యాక్ నిబంధనలు లేకపోవడమే ప్రధాన కారణం. మున్సిపల్ నుంచి అనుమతి తీసుకున్న తర్వాత కూడా నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లను నిర్మించడం వల్లే ఇప్పుడు బాధ పడాల్సిన పరిస్థితి. ఈ కాలనీల్లో ప్రస్తుతం రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో జనాలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఇలాంటి స్థలాల్లో ఇళ్లను నిర్మించి ఇబ్బందులు పడకుండా జాగ్రత్త పడాలని పట్టణ ప్రముఖులు సూచిస్తున్నారు.



సిద్దిపేటలోని ఓ ఆసుపత్రిలోని బెడ్లు బురదమయం కావడంతో శుభ్రం చేస్తున్న సిబ్బంది



సెల్లార్‌లోని వరదనీటిని బకెట్‌తో ఎత్తిపోస్తున్న దృశ్యం



పట్టణంలోని ఓ సెల్లార్‌లో మునిగిన వాహనాలు



తొగుట : గుంతలమయంగా మారిన రహదారి



శనిగరం ప్రాజెక్టు నుంచి మత్తడి పడుతున్న దృశ్యం

శనిగరం ప్రాజెక్టుకు జలకళ

- మత్తడి దూకుతున్న నీరు
- తరలివస్తున్న పర్యాటకులు

కోహెడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కోహెడ మండలంలోని శనిగరం మధ్యతరహా ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు మోయతుమ్మెద వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో బస్వాపూర్ ఫీడర్ ఛానల్ ద్వారా ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఒక టీఎంసీ సామర్థ్యం గల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టంతో కళకళలాడుతూ మత్తడి దూకుతోంది. భారీగా వరద నీరు మత్తడి పడుతుండడంతో జలపాతాన్ని తలపిస్తోంది. ఈ ప్రాజెక్టు ద్వారా కోహెడ, బెజ్జంకి మండలాల్లోని తొమ్మిది గ్రామాలకు చెందిన 5100 ఎకరాలకు సాగునీరు అందనుంది. నిండు కుండలా మారి మత్తడి దూకుతున్న ప్రాజెక్టు అందాలను చూసేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు. సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు.

ప్రాజెక్టును సందర్శించిన కలెక్టర్

శనిగరం రిజర్వాయర్‌ను కలెక్టర్ హైమావతి శుక్రవారం సందర్శించారు. చుట్టూ కొండల మధ్య నీరు జలపాతంలా దూకుతున్న దృశ్యాన్ని ఆమె తన ఫోన్‌లో వీడియో తీసుకున్నారు. పర్యాటకులు అటుగా వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

కోహెడ తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూభారతి అవగాహన సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. భూభారతి సమస్యల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్ సమీర్ హైమద్‌ఖాన్‌ను ఆదేశించారు. కార్యాలయ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

పలుచోట్ల ఘనంగా	వేర్వేరు కారణాలతో	గోదావరి మల్టీపర్పస్ ప్రాజెక్టుకు
క్రీడాదినోత్సవం	**ముగ్గురి ఆత్మహత్య**	**క్లియరెన్స్‌లు**
6	6	7

చిగురిస్తున్న ఆశలు

- జిల్లా అంతటా అతివృష్టి..
- హుస్నాబాద్ డివిజన్‌లో సాధారణం
- అయినా.. శనిగరం ప్రాజెక్టుకు జలకళ
- హుస్నాబాద్ డివిజన్‌లో సాగు పనులు ముమ్మరం
- గౌరవెల్లి ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని రైతుల విజ్ఞప్తి



హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కింద సాగు చేసిన పొలాలు

హుస్నాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంతటా భారీ వర్షాలతో అతలాకుతలం అవుతుంటే, హుస్నాబాద్ డివిజన్‌లో మాత్రం సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ప్రాంత రైతులు వర్షం కోసం వేడుకుంటూ ఆశలతో వ్యవసాయం చేస్తున్నారు. అయితే, ప్రస్తుతం కురిసిన వర్షాలు మెట్ట రైతాంగానికి ఊరటనిచ్చాయి. ప్రతిసారీ నీటి వనరులు లేక ఆకాశం వైపు చూసే అన్నదాతలకు ఆలస్యంగా కురిసిన వర్షాలు సాగుపై ఆశలు కల్పించాయి. అంతటా చెరువులు, కుంటలు నిండి అలుగు పారుతున్నా ఇక్కడ మాత్రం ఇంకా పూర్తిస్థాయిలో నిండలేదు. అయినప్పటికీ, మునుముందు వర్షాలు కురిసి చెరువులు నిండకపోతాయా.. అనే నమ్మకంతో సాగు చేస్తున్నారు. ఇప్పటికే వరి నాట్లు వేశారు. నాలుగేళ్లుగా సకాలంలో కురుస్తున్న వర్షాలు ఈ ప్రాంత రైతాంగానికి భరోసా కల్పిస్తున్నాయి. ఈసారి మే నెలలో వర్షాలు కురిసినా, తొలకరి మాత్రం ఆలస్యంగా వచ్చింది. జూన్, జూలైలో సాధారణ వర్షపాతం కంటే తక్కువ నమోదైంది. ఆగస్టులో కురిసిన వర్షాలు సాగుకు ఊతమిచ్చాయి. హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట, బెజ్జంకి, దూల్మిట్ట, మద్దూరు మండలాల్లో బెజ్జంకి, మద్దూర్, దూల్మిట్ట మండలాల్లో భారీ వర్షాలతో చెరువులు, కుంటలు నిండగా, సాగునీటి వనరులు లేని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల్లో చెరువులు, కుంటల్లోకి నీరు పూర్తిస్థాయిలో చేరలేదు. హుస్నాబాద్ డివిజన్‌లోని శనిగరం మధ్యతరహా ప్రాజెక్టు ఇటీవల కురిసిన వానలకు మత్తడి పారుతుంది. బెజ్జంకిలోని తోటపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ అలుగు పారుతుండగా, హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు మాత్రం ఇప్పటికీ పూర్తిగా నిండలేదు. వరుణుడు కరుణించి మెట్ట ప్రాంతంలోని చెరువులు, కుంటలను నింపి తమ ఆశల సాగును గట్టెక్కించాలని రైతులు కోరుకుంటున్నారు. గౌరవెల్లి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేస్తే తాము వరుణుడిపై ఆధారపడాల్సిన అవసరం ఉండదని రైతులు వాపోతున్నారు

డివిజన్‌లో 1.05 లక్షల ఎకరాల సాగు

హుస్నాబాద్ డివిజన్‌లో వర్షాల ఆధారంగానే సాగు విస్తీర్ణం ఉంటుంది. గత ఖరీఫ్‌లో జూలై చివరి వరకు నాట్లు వేశారు. ఈసారి మేలో వానలు బాగానే కురిసినా.. జూలై చివరి వరకు

మిగతా 8వ పేజీలో

డెంగ్యూతో విద్యార్థి మృతి

- జగదేవ్‌పూర్ మండలం అనంతసాగర్‌లో ఘటన
- పది రోజుల్లో ముగ్గురు మృతి
- కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్ఎంపీ క్లినిక్ సీజ్
- తిమ్మాపూర్ పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్



యశ్వంత్ (ఫైల్)

జగదేవ్‌పూర్/కుకునూరుపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డెంగ్యూ జ్వరాలు కలకలం సృష్టిస్తున్నాయి. డెంగ్యూతో బాధపడుతున్న ఓ విద్యార్థి మృతిచెందడంతో జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్ మధిర గ్రామమైన అనంతసాగర్‌లో విషాదం నెలకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతసాగర్‌కు చెందిన బోనగారి కిష్టయ్య, రూప దంపతుల చిన్న కుమారుడు యశ్వంత్ (10) కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. నాలుగు రోజులుగా యశ్వంత్ జ్వరంతో బాధపడుతుండటంతో కుకునూరుపల్లిలోని ఓ ఆర్ఎంపీ వైద్యుడి వద్ద చికిత్స చేయించారు. జ్వరం తగ్గకపోగా మరింత తీవ్రం కావడంతో గురువారం గజ్వేల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు రక్త పరీక్షలు నిర్వహించి డెంగ్యూ లక్షణాలు ఉన్నాయని నిర్ధారించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించాలని సూచించారు. హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా పరిస్థితి విషమించి యశ్వంత్ మార్గమధ్యలోనే మృతిచెందాడు. పది రోజుల్లో డెంగ్యూ కారణంగా ముగ్గురు మృతి చెందడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అయితే, ఈ ఘటనపై కలెక్టర్ ఆరా తీశారు. బాలుడి మృతికి ఆర్ఎంపీ వైద్యుడి నిర్లక్ష్యమే కారణమని నిర్ధారించిన జిల్లా వైద్య బృందం, కలెక్టర్ ఆదేశాల మేరకు సదరు ఆర్ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేశారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు

తిమ్మాపూర్ పంచాయతీ కార్యదర్శి శైలేష్‌ను సస్పెన్షన్ చేస్తూ కలెక్టర్ హైమావతి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. తిమ్మాపూర్‌లో పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం వల్లే గ్రామంలో ఇద్దరు యువకులు డెంగ్యూతో మరణించారని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శిని సస్పెన్షన్ చేస్తున్నట్లు ఉత్తర్వులలో కలెక్టర్ పేర్కొన్నారు. శైలేష్ సస్పెన్షన్ కావడంతో అనంతసాగర్ గ్రామకార్యదర్శి విక్రమ్‌ను తిమ్మాపూర్ ఇన్‌చార్జి కార్యదర్శిగా నియమిస్తూ జగదేవ్‌పూర్ ఎంపీడీవో రామ్‌రెడ్డి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

మంజీర నదిలో వ్యక్తి గల్లంతు

● శివంపేట వంతెన వద్ద ఘటన

పుల్‌కల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో మంజీర నదిలో దూకి ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. ఈ సంఘటన శుక్రవారం చౌటకూర్ మండలం శివంపేట వంతెన వద్ద చోటు చేసుకున్నది. పుల్కల్ ఎస్సై విశ్వజన్ తెలిపిన వివరాల ప్రకారం.. శివంపేట గ్రామానికి చెందిన బడంపేట మల్లాగౌడ్ (45) మద్యానికి బానిసయ్యాడు. కొన్నేళ్లుగా మద్యం తాగుతూ భార్య సావిత్రితో గొడవ పడేవాడు. తాగడానికి డబ్బులు ఇవ్వాలంటూ మూడు రోజులుగా ఇంట్లో భార్యను వేధింపులకు గురి చేశాడు. ఈ క్రమంలోనే శుక్రవారం భార్య సావిత్రితో గొడవ పడి, మద్యం తాగాడు. తాగిన మైకంలో శివంపేట గ్రామ సమీపంలో గల మంజీర నదిపై నిర్మించిన కొత్త వంతెనపైకి ఎక్కి నదిలోకి దూకాడు. మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురిసిన భారీ వర్షాలకు మంజీర రిజర్వాయర్ గేట్లు ఆరు క్రస్ట్ గేట్లు ఎత్తారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీటి ప్రవాహంలోనే నదిలో దూకి గల్లంతయ్యాడు. ఈ సంఘటన విషయం తెలుసుకున్న స్థానికులు పుల్కల్ ఎస్సై విశ్వజన్‌కు సమాచారం అందించారు. ఆయన ఘటనా స్థలానికి చేరుకుని రెస్క్యూ బృందాన్ని రప్పించారు. గల్లంతైన వ్యక్తి కోసం దిగువన మంజీర నది పరివాహక ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. ఎంత వెతికినా ఫలితం లేకుండా పోవడంతో గాలింపు చర్యలను నిలిపివేశారు. ఇదిలావుండగా, బడంపేట మల్లాగౌడ్ కొత్త వంతెనపైకి ఎక్కి మంజీర నదిలోకి దూకుతున్న దృశ్యం సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161వ జాతీయ రహదారిపై మంజీర నదిపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో రికార్డు అయింది. ఈ మేరకు భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు ఎస్సై విశ్వజన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మల్లాగౌడ్ (ఫైల్)



మంజీర నది వరద నీటిలో గాలిస్తున్న రెస్క్యూ టీం

ఇద్దరు పిల్లలతో మహిళ అదృశ్యం



అదృశ్యమైన ఉమ, ఇద్దరు పిల్లలు

కోహీర్, ఆగస్టు 29: (ఆంధ్రజ్యోతి) ఇద్దరు పిల్లతో పాటు తల్లి అదృశ్యమైన సంఘటన గురువారం కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామంలో జరిగింది. కోహీర్ ఎస్సై నరేష్ కథనం ప్రకారం.. దిగ్వాల్ గ్రామానికి చెందిన చెందే కిష్టయ్య భార్య ఉమ, వారి ఇద్దరు కొడుకులు ఈనెల 28న అదృశ్యమైనట్లు ఎస్సై తెలిపారు. గ్రామానికి చెందిన చెందే కిష్టయ్యకు 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. వారికి ముగ్గురు కుమారులు ఉన్నారు. కిష్టయ్య గ్రామ సమీపంలోని ఓ కర్మాగారంలో పనిచేస్తున్నాడు. యధావిధిగా కిష్టయ్య ఈనెల 28న ఉదయం పరిశ్రమకు వెళ్ళాడు. అక్కడ విధులు ముగించుకొని సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంట్లో భార్య ఉమా ఇద్దరు కొడుకులు కనిపించకుండా పోయారు. దీంతో భార్య, పిల్లల ఆచూకీ కోసం ఇరుగుపొరుగు వారికి అడిగిన ఆచూకీ లభించకపోవడంతో ఈ నెల 28వ తేదీన శుక్రవారం కోహీర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అదృశ్యమైన మహిళ, పిల్లల ఆచూకీ ఎవరికైనా తెలిసి ఉంటే 8712656765 నంబర్‌ను సంప్రదించాలని ఎస్సై తెలిపారు..

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

హత్నూర/బెజ్జంకి/చిన్నకోడూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తల్లి మందలించిందని ఒకరు, క్షణికావేశంలో మరొకరు, అనుమానాస్పద స్థితిలో ఇంకొకరు ఇలా వేర్వేరు కారణాలతో వేర్వేరు చోట్ల ముగ్గురు ఉరేసుకొని చనిపోయారు. తరచూ ఫోన్ మాట్లాడుతున్నావని తల్లి మందలించడంతో మనస్తాపం చెందిన కుమారుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన గురువారం రాత్రి చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్‌లో జరిగింది. ఎస్సై సైఫ్ అలీ, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంనగర్‌కు చెందిన పొన్నాల ఎల్లవ్వ మల్లేశం దంపతులకు కొడుకు శివసాయి (19) కూతురు ఉన్నారు. మల్లేశం రెండు సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శివసాయి కూలీ పని చేసుకుంటూ ఉండేవాడు. శివ సాయి కొన్ని రోజుల నుంచి ఓ అమ్మాయిని ప్రేమించానని, వివాహం చేసుకుంటానని తల్లి ఎల్లవ్వతో చెప్పాడు. కుటుంబం గడవడమే కష్టంగా ఉందని కొన్ని రోజుల తర్వాత వేరే అమ్మాయిని చూసి వివాహం చేస్తానని సర్ది చెప్పింది. ఈనెల 28న (గురువారం) తల్లి ఎల్లవ్వ ఇంట్లో ఉన్న శివ సాయికి పనికి వెళ్లమని చెప్పి తను కూలి పనికి వెళ్లింది. తల్లి పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చే సరికి కుమారుడు ఫోన్‌లో ఎవరితోనే మాట్లాడుతుండగా తరచూ ఫోన్ మాట్లాడుతూనే ఉంటావా అని మందలించింది. ఈ క్రమంలో శివసాయి ఇంటి పక్కనే ఉన్న రేకుల రూంలోకి వెళ్లి తన బెల్టుతో ఇనుప రాడుకు ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు కిందికి దింపి గ్రామస్థుల సాయంతో సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. శుక్రవారం మృతుడి తల్లి ఎల్లవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



శివసాయి (ఫైల్)

ఇంటర్ విద్యార్థిని ..

ఉరి వేసుకొని ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన హత్నూర మండలం కొన్యాలలో శుక్రవారం చోటు చేసుకుంది. హత్నూర ఎస్సై శ్రీధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... పుల్కల్ మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన మిన్పూరి మల్లేశం కూతురు మిన్పూరి అనుష అలియాస్ వడ్డేపల్లి అనూష (16) హత్నూర మండలం కొన్యాల గ్రామంలోఅమ్మమ్మ వడ్డేపల్లి మల్లమ్మ దగ్గర ఉంటుంది. గుండ్లమాచునూర్ శివారులోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. అనూష శుక్రవారం ఉదయం కళాశాలకు వెళ్లడం కోసం కొన్యాల గ్రామంలో బస్సు కోసం నిల్చుంది. అదే సమయంలో అమ్మమ్మ అటువైపు వెళ్తూ అనూష చేతిలో టిఫిన్ బాక్సు కనిపించకపోవడంతో టిఫిన్ బాక్సు ఎందుకు తీసుకువెళ్లడం లేదు.. మీ నాన్నకు చెబుతానని అనడంతో అనూష తిరిగి ఇంటికి వెళ్లింది. అమ్మమ్మ పని నిమిత్తం బయటకు వెళ్లగా.. అనూష క్షణికావేశంలో ఇంట్లోని దూలానికి చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కొద్దిసేపటి తర్వాత అనూష అమ్మమ్మ వచ్చి చూసేసరికి అనూష ఉరి వేసుకుని కనిపించడంతో తన తల్లిదండ్రులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చింది. వారు వచ్చి అనూష మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. అనూష తండ్రి మిన్పూరి మల్లేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

జీవనోపాధి దొరకకపోవడంతో..

బెజ్జంకి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జీవనోపాధి దొరకకపోవడంతో పాటు వివాహం కావడం లేదని మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందాడు. ఈ సంఘటన ఎల్లంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లంపల్లికి చెందిన సంగెం రాజేందర్ (25) అనే యువకుడు డిగ్రీ వరకు చదువుకున్నాడు. గురువారం కిరాణా సామాను తీసుకువస్తానని రాజేందర్ ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టూ పక్కల వెతికారు. శుక్రవారం మండల కేంద్రంలోని శ్మశాన వాటిక సమీపంలో చెట్టుకు ఉరి వేసుకొని కనిపించాడు. మృతుడి తల్లి చంద్రవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై శంకర్‌రావు తెలిపారు.



రాజేందర్ (ఫైల్)

నైపుణ్యాల అభివృద్ధితోనే మంచి భవిష్యత్

నారాయణఖేడ్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటుందని సీఎస్ఆర్‌బాక్స్ సంస్థ ప్రతినిధి సాయి ప్రసాద్ స్వామి అన్నారు. ఖేడ్ సాహితీ డిగ్రీ కళాశాలలో 10 రోజుల పాటు ఉచితంగా విద్యార్థులకు సీఎస్ఆర్‌బాక్స్ సంస్థ ఐబీఎం స్కిల్స్ బిల్డ్‌తో కలిసి నిర్వహిస్తున్న ఆటమ్ సర్టిఫికేషన్ ప్రోగ్రాం-2025 శిక్షణ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతతూ 10 రోజుల పాటు ఉచితంగా అందించే ఈ ప్రోగ్రాంలో ఏఐ ఫ్రమ్ కురియస్ టు క్రియేటర్, క్రాక్ యువర్ కేరీర్, ఐఏ పవర్డ్ ప్లేస్‌మెంట్ అసిస్టెంట్ లెర్నింగ్ పాథ్‌లపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ ద్వారా విద్యార్థులు ప్రాజెక్టుల్లో పాల్గొని ప్రాక్టికల్‌గా నేర్చుకునే అవకాశం పొందడంతో పాటు కేరీర్‌కు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. శిక్షణ అనంతరం ధృవ పత్రాలతో పాటు డిజిటల్ బ్యాడ్జీలు అందజేస్తామన్నారు.

సహాయక చర్యల్లో పోలీస్ శాఖ

మెదక్ అర్బన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు పోలీస్ శాఖ అప్రమత్తమై సహాయక చర్యల్లో నిమగ్నమైనట్లు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న రక్షణ చర్యలు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్ట కాలంలో ప్రజలకు అండగా నిలిచే బాధ్యతను పోలీసులు సమర్థవంతంగా నిర్వర్తించారన్నారు. ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు సమన్వయంతో పని చేసి అనేక ప్రాణాలను రక్షించాయన్నారు. వర్షాలు తగ్గుముఖం పడుతున్న చెరువులు, వాగులు, నదులు ప్రమాదకరంగా ఉన్నాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. సెల్ఫీ మోజు కారణంగా అనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వరద ప్రహహాల దగ్గరకు వెళ్లి చూడడం, వాటి వద్ద ఫోటోలు, సెల్ఫీలు దిగడం ప్రజల ప్రాణాలకు ప్రమాదకరం. ఆ సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల ప్రతిజ్ఞ

జోగిపేట, ఆగష్టు 29(ఆంధ్రజ్యోతి): శారీరక, మానసిక దృఢత్వం కోసం ఆరోగ్యకర అలవాట్లను అలవర్చుకుంటామంటూ అందోలు-జగిపేట మున్సిపల్ ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం, కమిషనర్ రవీందర్... ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా, యోగ, ఉదయం సాయంత్రపు నడక, సైక్లింగ్, తదితర ఆరోగ్యకర అలవాట్లను తమ నిత్యజీవితంలో భాగం చేస్తామని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్, ఏఈ శ్రీకాంత్, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ బోల్తా

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్- పందిల్ల సమీపంలో నూతనంగా నిర్మించిన హై లెవల్ బ్రిడ్జి సమీపంలో ఇసుక లారీ బోల్తాకొట్టింది. శుక్రవారం తెల్లవారు జామున భద్రాచలం నుంచి-సిద్దిపేటకు ఇసుకలోడ్‌తో వస్తున్న లారీ రోడ్డు పక్కన ఒకవైపు ఒరిగింది. దీంతో లారీలోని ఇసుక మొత్తం కిందపడింది. ఈ సంఘటనలో డ్రైవర్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదు. అయితే బ్రిడ్జి సమీపంలో కొత్తగా రోడ్డు నిర్మాణం చేస్తున్న సందర్భంగా ఎలాంటి సూచిక బోర్డు ఏర్పాటు చేయక పోవడం వలన ఎదురుగా వచ్చే వాహనాల ఫోకస్‌కు డ్రైవర్ కన్ఫ్యూజన్ కావడంతో లారీ అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్ అప్రమత్తమై లారీ క్యాబిన్ నుంచి కిందకు దూకడంతో ప్రాణాప్రాయం నుంచి బయటపడ్డాడు.

కాలు పోయినా పట్టించుకోని పరిశ్రమ



మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సుభాష్‌గౌడ్‌కి ఫిర్యాదు చేస్తున్న బాధిత కుటుంబీకులు

మనోహరాబాద్, అగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలో పనిచేస్తుండగా గోడ కూలి ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి కాలుపై గోడ పడి కాలు తెగిపోయిన విషయం తెలిసిందే. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ శివారులోని జాతీయ రహదారి పక్కన రామ స్పిన్నింగ్ మిల్లు ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో ఈ నెల 9న వాటర్ ట్యాంక్ వద్ద పని చేస్తుండగా గోడ కూలి కార్మికుల మీదపడటంతో మనోహరాబాద్‌కు చెందిన తమ్మరెడ్డి బాల్‌రెడ్డి అక్కడికక్కడే చనిపోయాడు. పక్కనే ఉన్న మరోకరు కాళ్లకల్ చెందిన గానుగు రవి (43) కాలుపై గోడ పడడంతో కాలు తెగిపోయింది. దీంతో అప్పటి నుంచి రవి మంచాన పడ్డాడు. దీంతో రవి కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు పరిశ్రమ యాజమన్యంతో పలు మార్లు చర్చలు జరిపిన పరిశ్రమ యజమాన్యం హామీ ఇచ్చి చివరకు ఏమి చేసుకుంటారో చేసుకో అని పట్టించుకోవడం లేదని కుటుంబీకులు తెలిపారు. దీంతో కాలు పోయి తన భర్త కుటుంబాన్ని పోషించే వారు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఆదుకోవాలని రవి భార్య మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పరిశ్రమ యజమాన్యం జీఎమ్ సుధీర్‌పై, తగిన చర్యలు తీసుకొని తన భర్తకు న్యాయం చేయాలని భార్య బాలమణి కోరారు.

సహాయక చర్యల్లో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



ప్రజలతో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

హవేళిఘణపూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల్లో సహాయక చర్యలు తీసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఆరోపించారు. గురువారం నాటి వరదకు ఇద్దరు గల్లంతై, ఒకరి మృతదేహం దొరికిన మెదక్ జిల్లా హవేళిఘణపూర్ మండలంలో రాజీపేటతో పాటు పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి వరద పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు వచ్చి నాలుగు రోజులు అవుతున్నా.. ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోలేదన్నారు. రాష్ట్రంలో దాదాపు ఐదు లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, ప్రజల ఇండ్లల్లోకి నీరువచ్చి ఒక్కో కుటుంబానికి పది నుంచి ఇరవై వేల రూపాయాల నష్టం జరిగిందన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 25 వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వరద బాధితులకు కనీసం తాగునీరు కూడా ఇవ్వడం లేదని, సీఎం పైపై పర్యటనలు చేస్తున్నారని, కేంద్రం అస్సలు పట్టించుకోవడం లేదన్నారు. హైదరాబాద్ వెళ్లే రోడ్లు తెగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రోడ్ల సమస్యలు త్వరగా పరిష్కరించాలన్నారు. ఆయన వెంట సీపీఎం నాయకులు నర్సమ్మ, ఆడివయ్య, కె.మల్లేశం, కొమురయ్య తదితరులు ఉన్నారు.



రామాయంపేటలో



వెల్దుర్తి మండలంలో కొట్టుకుపోయిన ఎలుకపల్లి- యశ్వంతరావుపేట రోడ్డు

అల్లకల్లోలం

ఉమ్మడి మెదక్ జిల్లా వర్ష ప్రభావ ప్రాంతంలో అస్తవ్యస్తంగా తయారైంది. శుక్రవారం వరద ప్రభావం తగ్గడంతో ఆయా ప్రాంతాల్లో ధ్వంసమైన రోడ్డు, దెబ్బతిన్న పంటలు, కూలిన ఇళ్ల దృశ్యాలే కనిపించాయి

- న్యూస్ నెట్‌వర్క్



అల్వాల్, మెట్టు వద్ద వరద నీటిని దాటుతున్న వ్యక్తి



మక్తాభూపతిపూర్‌లో కూలిన ఇల్లు



కోహీర్‌లో కూలిన ఇల్లు



తొగుట మండలంలోని లింగాపూర్ గ్రామంలో కూలిన ఇల్లు





సిద్దిపేట పట్టణంలో సెల్లార్‌లోని నీటిలో కారు, రేగోడు మండలంలో నీట మునిగిన పంట



కల్హేర్ మండలం దేవునిపల్లిలో పొలంలో ఇసుక మేటలు



నార్సింగ్ మండల కేంద్రంలో..



ఖేడ్ మండలం నమ్లీమేట్‌లో చెరువులా వరి చేను



సిద్దిపేట జిల్లాలో వరద ప్రవాహానికి చేనులో చేరిన ఇసుక

గోదావరి మల్టీపర్పస్ ప్రాజెక్టుకు చకచకా క్లియరెన్స్‌లు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గోదావరి మల్టీపర్పస్ ప్రాజెక్టుకు క్లియరెన్స్‌లు చకచకా వస్తున్నాయి. సిద్దిపేట జిల్లా మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి హైదరాబాద్ మహానగరం వరకు రెండు వరుసల్లో 3500 సామర్థ్యం కలిగిన భారీ రెండు పైపులైన్లను ఏర్పాటు చేయడానికి పెద్దఎత్తున భూములు అవసరంతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలు అనుమతులివ్వాల్సి ఉన్నది. ఇందుకోసం ఇప్పటికే వాటర్‌బోర్డు అధికారులు ఆయా శాఖల ఉన్నతాధికారులతో సంప్రదింపులు చేశారు. నిర్ణీత గడువులో ప్రాజెక్టు పూర్తి చేయడానికి చర్యలు చేపడుతున్నారు.

రూ.7,300 కోట్లతో రెండు ఫేజ్‌ల్లో పనులు

భవిష్యత్తు అవసరాల అనుగుణంగా హైదరాబాద్ ప్రజల దాహార్తి తీర్చడం, మూసీ ప్రక్షాళన, జంట జలాశయాల పునరుజ్జీవం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మల్టీపర్పస్ గల ఫేజ్-2, ఫేజ్-3 ప్రాజెక్టును రూ.7,360 కోట్లతో చేపడుతోంది. ఈ ప్రాజెక్టులో భాగంగా మల్లన్నసాగర్ నుంచి పంపింగ్ ద్వారా రెండు వరుసల్లో ఉండే 3600 డయా పైపులైన్ల ద్వారా 26 కిలోమీటర్ల మేర శామీర్‌పేట వద్ద గల ఘన్‌పూర్ వరకు నీటిని తీసుకోస్తారు. ఘన్‌పూర్ వద్ద శుద్ధి చేసిన నీటిని నగరానికి తరలించనుండగా.. శుద్ధి చేయని నీటిని మరో పైపులైన్ ద్వారా నేరుగా ఉస్మాన్‌సాగర్ (గండిపేట), హిమాయత్ సాగర్ జలాశయాలకు తరలించనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం పైపులైన్ల నిర్మాణానికి ఫారెస్టు, ఇరిగేషన్, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, హెచ్‌ఎండీఏ, పర్యావరణ ఇలా ఏడు ప్రభుత్వ శాఖల అనుమతులు సాధించాల్సి ఉన్నది. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ఎల్లంపల్లి నుంచి గోదావరి జలాల పనుల కోసం సేకరించిన భూములు కొండపోచమ్మ నుంచి ఘన్‌పూర్ మధ్యలో కొంత వరకు ఉపయోగపడుతున్నాయి. సిద్దిపేట, మెదక్, మేడ్చల్ జిల్లాల పరిధిలో ప్రభుత్వ భూములు, 20ఎకరాల వరకు అసైన్డ్ భూములు, పది ఎకరాల వరకు ప్రైవేటు భూములు అవసరమున్నాయి. ఆయా భూములను స్వాధీనం చేసుకోవడానికి ఆయా జిల్లాల కలెక్టర్లతో వాటర్‌బోర్డు అధికారులు చర్చించారు. మెదక్ జిల్లాలోని ములుగు వద్ద, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఘన్‌పూర్ వద్ద కొంత వరకు ఫారెస్టు భూములు దాదాపు వంద ఎకరాల వరకు అవసరమున్నది. ఆయా భూములను సేకరణ కోసం ఫారెస్టు అధికారులతో సంప్రదింపులు జరిపారు.

సంగారెడ్డి స్టేడియాన్ని అభివృద్ధి చేస్తాం

● జగ్గారెడ్డికి చిత్తశుద్ధి ఉంటే పేదలకు పట్టాలు ఇవ్వాలి
● మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

సంగారెడ్డి అర్బన్/సిద్దిపేట క్రైం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియాన్ని 'ఖేలో ఇండియా' ద్వారా ఏడాదిలోగా రూపురేఖలు మారుస్తానని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ప్రకటించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సంగారెడ్డి, సిద్దిపేటలలో జరిగిన కార్యక్రమాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి జాతీయ క్రీడా దినోత్సవ ర్యాలీని ఎంపీ జెండా ఊపి ప్రారంభించారు. సంగారెడ్డిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో ఆడపిల్లలను ప్రోత్సహించాలన్నారు. ప్రధాని మోదీ సూచనల మేరకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా దేశంలో అత్యుత్తమ క్రీడాకారులను తీర్చిదిద్దడానికి కృషి చేస్తుందని తెలిపారు. ఫుట్‌బాల్, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ వంటి ఐదు క్రీడలను జిల్లాలో మరింత అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం ఎంపీ విలేకరులతో మాట్లాడుతూ కొండాపూర్ మండలం తొగర్‌పల్లి, అలియాబాద్‌లలో గతంలో కొందరు పేదలు, జర్నలిస్టులకిచ్చిన ప్లాట్లను టీజీఐఐసీ తీసుకుంటుందని, ఇది సరికాదని అన్నారు. గతంలో పేదల ఇళ్ల స్థలాలపై అసెంబ్లీలో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ప్రస్తావించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నిజంగా పేదల మీద ఆయనకు చిత్తశుద్ధి ఉంటే ఆ పట్టాలను పేదలకివ్వాలని కోరారు. సిద్దిపేటలోని డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన నేషనల్ స్పోర్ట్స్ డే కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ.. మెరుగైన ఆరోగ్యం కోసం ఫిట్ ఇండియాలో పాల్గొనాలని యువతకు సూచించారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించాలని, భారత ప్రభుత్వం మొత్తం ఎనిమిది క్రీడల్లో టోర్నమెంట్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. జనాభాలో చైనాను దాటుతున్న భారత్ ఒలింపిక్, ఏషియన్ గేమ్స్ మెడల్స్ విషయంలో వెనుకబడి ఉండడం బాధాకరమన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు అందుబాటులోకి తెచ్చిన స్కానర్‌ను, పోర్టల్‌ను ప్రతి పాఠశాలకు తీసుకువెళ్లి విద్యార్థులను నమోదు చేయాలని జిల్లా క్రీడాధికారికి సూచించారు. అనంతరం జాతీయ క్రీడా దినోత్సవ ర్యాలీని ఎంపీ సిద్దిపేట కలెక్టర్ హైమావతితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీవైఎస్‌వో ఖాసీంబేగ్, సిద్దిపేట కలెక్టర్ హైమావతి, టీఎన్‌జీవో సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు జావిద్‌అలీ, టీజీవో అధ్యక్షుడు వైద్యనాథ్, యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు కూనవేణు, ఇతర నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియంలో క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, కలెక్టర్ ప్రావీణ్య

సొమ్మసిల్లిన విద్యార్థిని

సంగారెడ్డిలో జరిగిన క్రీడా దినోత్సవ కార్యక్రమంలో ఒక విద్యార్థిని ఫిట్స్ వచ్చి సొమ్మసిల్లి పడిపోయింది. ఆమెను వెంటనే 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, ఆమె ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని అధికారులు తెలిపారు.



జాలరి వలకు అరుదైన చేప

చిన్నశంకరంపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): చిన్నశంకరంపేట మండలం ప్యాటగడ్డ గ్రామంలో ఒక జాలరి వలకు అరుదైన చేప చిక్కింది. భారీ వర్షాల కారణంగా వరదలకు ఎదురు ఈదుతూ వచ్చిన చేపల్లో ఒకటి పొడవాటి ముక్కుతో తెల్లగా ఉండటంతో గ్రామస్థులు ఆశ్చర్యపోయారు. ఇది మంచి నీటిలో ఉండే గార్ ఫిష్ అని, దీనిని శాస్త్రీయంగా జెనెంటొడాన్ కాన్సిలా అని పిలుస్తారని మత్స్యకారుల తెలిపారు.

మోదుగు ఆకులతో వినాయకుడు

సిద్దిపేట జిల్లా వర్గల్ మండల కేంద్రానికి చెందిన యువకుడు దయాకర్ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తూ మోదుగు ఆకులతో ఏడు అడుగుల వినాయకుడి విగ్రహాన్ని తయారు చేశాడు. దయాకర్‌ను పలువురు అభినందిస్తున్నారు.

- వర్గల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి)



టోకెన్లు చిక్కినా.. యూరియా దొరక్క

● బారులు తీరిన అన్నదాతలు... గంటల కొద్దీ నిరీక్షణ ● సార్‌ల కాళ్లు మొక్కే దాకా తెచ్చిన కష్టాలు

జగదేవ్‌పూర్/నంగునూరు/నంగునూరు/హుస్నాబాద్/వర్గల్/మద్దూరు/చేర్యాల/నర్సాపూర్/చిన్నశంకరంపేట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో శుక్రవారం యూరియా కోసం రైతులకు నిరీక్షణ తప్పలేదు. ఒక్క బస్తా కోసం గంటల తరబడి వేచిచూశారు. పలుచోట్ల తోపులాటలు, వాగ్వాదాలు వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. టోకెన్లు దక్కినప్పటికీ యూరియా దొరకకపోవడంతో రైతులు మండిపడుతున్నారు.

● జగదేవ్‌పూర్ మండలం కేంద్రంలోని హాకా కేంద్రం వద్ద ఉదయం 7 గంటల నుంచే రైతులు క్యూలో తమ పాస్‌బుక్‌లను పెట్టి నిరీక్షించారు. ఇక్కడికి 500 యూరియా బస్తాలు రాగా, దాదాపు 200 మంది రైతులు గంటల తరబడి ఎదురుచూశారు.

● యూరియా లారీ వస్తుందన్న సమాచారంతో తెల్లవారుజామునే వందల మంది రైతులు నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలోని సహకార సంఘం వద్దకు చేరుకున్నారు. ఒక్క బస్తా కోసం వర్షాన్ని కూడా లెక్కచేయకుండా రైతులు ఏడు గంటల పాటు ఎదురుచూశారు. అది కూడా ఒక్కొక్కరికి ఒకే బస్తా రావడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు.

● కుకునూరుపల్లి రైతువేదిక వద్ద ఉదయం 6 గంటల నుంచే చెప్పులను క్యూలైన్‌లో ఉంచి టోకెన్ల కోసం నిరీక్షించారు. టోకెన్లు అందుకున్న రైతులు అగ్రోస్ సేవా కేంద్రం వద్దకు వెళ్లి యూరియాను తీసుకువెళ్లారు. ఎకరం లోపు ఉన్న రైతులకి ఒక బస్తా, ఎకరం కంటే ఎక్కువ భూమి ఉన్న వారికి రెండు బస్తాలు ఇచ్చారు. కేవలం మూడు గంటల్లోనే యూరియా నిల్వలు అయిపోయాయి. యూరియా దొరకని రైతులు అసంతృప్తితో వెనుదిరిగారు.

● హుస్నాబాద్ పట్టణంలో పలు ఎరువుల దుకాణాల వద్ద రైతులు బారులు తీరారు. హుస్నాబాద్‌కు రెండు లోడ్ల యూరియా రాగా, వాటిని మూడు దుకాణాలకు కేటాయించారు. రెండు రోజుల క్రితం టోకెన్లు తీసుకున్న రైతులు ఉదయం నుంచే యూరియా కోసం ఎదురుచూశారు.

● మద్దూరు మండలకేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణం వద్ద యూరియా కోసం రైతులు పెద్ద సంఖ్యలో గుమిగూడడంతో తోపులాట జరిగింది. కేవలం 23 టన్నుల యూరియా మాత్రమే అందుబాటులో ఉండగా, 220 మంది రైతులకు పంపిణీ చేశారు.

● చేర్యాల మండలం తాడూరు గ్రామంలోని దుకాణం వద్ద రైతులు గంటల తరబడి పడిగాపులు కాశారు. ఒక్కో బస్తా మాత్రమే ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, యూరియా కొరతను తీర్చాలని డిమాండ్ చేశారు.

● నర్సాపూర్ పీఏసీఎస్ వద్ద ఒకే లారీ లోడ్ యూరియా రావడంతో పెద్ద ఎత్తున వచ్చిన రైతులకు అది సరిపోలేదు. టోకెన్ల కోసం రైతులు ఎగబడటంతో పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని నియంత్రించాల్సి వచ్చింది. మిగిలిన రైతులు టోకెన్లు తీసుకుని నిరాశతో వెనుదిరిగారు.


● వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రైతులు, మహిళలు యూరియా కోసం చిన్నశంకరంపేటలో బారులు తీరారు. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు టోకెన్ల కోసం నిలబడ్డారు. పోలీసులు బందోబస్తు మధ్య అధికారులు టోకెన్లను పంపిణీ చేశారు. ప్రభుత్వంపై పలు విమర్శలు చేస్తూ రైతులు తమ నిరసనను తెలియజేశారు.

సార్... యూరియా ఇవ్వండి

గజ్వేల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : యూరియా అందుబాటులోకి వచ్చినా టోకెన్ల పేరుతో జాప్యం జరుగుతోందని ఆగ్రహించిన రైతులు శుక్రవారం గజ్వేల్ - తూప్రాన్ రహదారిపై ధర్నాకు దిగారు. పోలీసులు సర్దిచెప్పినా వినలేదు. ఈక్రమంలో గజ్వేల్ మండల వ్యవసాయాధికారి గుండు నాగరాజు ఫర్టిలైజర్ దుకాణం వద్దకు రాగా, ఒక్కసారిగా రైతులు ఆయనతో వాదనకు దిగారు. అక్కడున్న ఇద్దరు రైతులు 'సార్.. యూరియా ఇవ్వండి' అంటూ కాళ్లు మొక్కే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పెద్దఎత్తున రైతులు వ్యవసాయాధికారిని చుట్టుముట్టి, తమతో పాటు ధర్నాలో కూర్చోవాలని డిమాండ్ చేశారు. ఘటన స్థలానికి గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ చేరుకుని వారిని సముదాయించారు. చివరికి పోలీసుల సహకారంతో యూరియా పంపిణీ జరగడంతో పరిస్థితి సద్దుమణిగింది. 130 టన్నుల యూరియా ఆయా దుకాణాల్లో అందుబాటులోకి వచ్చిందని గజ్వేల్ వ్యవసాయ శాఖ ఏడీ బాబునాయక్ తెలిపారు.



చేర్యాల మండలం తాడూరు గ్రామంలో ఫర్టిలైజర్ దుకాణం వద్ద ఎగబడుతున్న రైతులు



దుబ్బాకలో బారులు తీరిన రైతులు







గజ్వేల్ - తూప్రాన్ రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు, జగదేవ్‌పూర్‌లో వరుసలో పెట్టిన పాస్‌పుస్తకాలు, నర్సాపూర్ పీఏసీఎస్ వద్ద రైతులు

కంది పీఏసీఎస్‌లో విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

కంది, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : కంది పీఏసీఎస్‌ను హైదరాబాద్ జోన్ విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విజిలెన్స్ సీఐ నాగుల్‌మీర పీఏసీఎస్‌లో యూరియా కొరత, స్టాకు వివరాలపై ఆరా తీశారు. అనంతరం పీవోఎస్ (పాయింట్ ఆఫ్ సేల్) మిషన్‌ను తనిఖీ చేశారు. ఈ సీజన్‌లో అమ్మకాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ప్రస్తుతం నిల్వ ఉన్న స్టాక్‌ను లెక్కచూశారు. రైతులతో మాట్లాడి పలు వివరాలను సేకరించారు. అనంతరం మండల ఏవో శ్రీనివాస్ ద్వారా పంటల వివరాలు, ఎన్ని వేల ఎకరాల్లో ఏఏ పంటలు వేశారో, మండలవ్యాప్తంగా ఇంకా ఎన్ని టన్నుల యూరియా అవసరం ఉందో తెలుసుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సీఐ నాగుల్‌మీర, ఏవో శ్రీనివాస్, పీఏసీఎస్ సీఈవో మందాడ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలి

● మెదక్ జేఏసీ చైర్మన్ దొంత నరేందర్

మెదక్ అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో చేర్చాలని జేఏసీ చైర్మన్ దొంత నరేందర్ డిమాండ్ చేశారు. స్థానిక టీఎన్జీవో భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రమాదకరంగా మారిన నూతన పెన్షన్ విధానాన్ని (సీపీఎస్) రద్దు చేయాలని కోరారు. దీనికి వ్యతిరేకంగా ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు పద్మారావు, శ్రీనివాస్, టీఎన్జీవో కార్యదర్శి రాజ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనురాధ, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఇక్బాల్ పాషా, జిల్లా ఉపాధ్యక్షులు ఫజులూద్దీన్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి కవితాదేవి

జహీరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబర్ 13న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించేందుకు కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్ కవితాదేవి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని కోర్టులో న్యాయవాదులు, పోలీసులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ లోక్ అదాలత్ వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమాచారం కోసం స్థానిక తహసీల్దార్‌ను, పోలీసు అధికారులను, మండల లీగల్ సర్వీసెస్ కమిటీని సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి మహ్మద్ అబ్దుల్ ఖలీల్, అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి దాసరి బ్లెస్సీ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ ఆర్టీసీ టూర్ ప్యాకేజీ

నర్సాపూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ డిపో నుంచి ప్రయాణికుల కోసం ప్రత్యేక టూర్ ప్యాకేజీలను ఆర్టీసీ నడుపుతోందని డిపో ఇన్‌చార్జి లక్ష్మణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 6న సంగారెడ్డి జిల్లాలోని ప్రముఖ క్షేత్రాలైన జరాసంగం, రేజింతల్ సిద్ధివినాయక, బీదర్ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రాలకు యాత్ర ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 7 గంటలకు నర్సాపూర్ నుంచి బయలుదేరి సాయంత్రం 7 గంటలకు తిరిగి చేరుకుంటుందని తెలిపారు. ఈ ప్యాకేజీ ధర పెద్దలకు ఒక్కొక్కరికి రూ.380, పిల్లలకు రూ.200గా నిర్ణయించారు. పూర్తి వివరాల కోసం ఫోన్ నెంబర్లను 9491634420, 9701724155 సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు మోడల్ స్కూల్స్ లో స్పాట్ అడ్మిషన్స్: డీఈవో

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి గానూ సిద్దిపేట జిల్లాలోని అన్ని మోడల్ స్కూల్స్‌లోని 6వ తరగతి నుంచి పదవ తరగతి, అలాగే ఇంటర్మీడియట్‌లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి చర్యలు చేపడుతున్నట్లు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇందుకోసం ఈ నెల 30న స్పాట్ అడ్మిషన్స్ చేపడుతున్నట్లు చెప్పారు. మెరిట్ ఆధారంగా ఈ అడ్మిషన్ ప్రక్రియ ఉంటుందన్నారు.

సెప్టెంబర్ 22 నుంచి ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు

ఓపెన్ స్కూల్ పదోతరగతి, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు సెప్టెంబర్ 22 నుంచిప్రారంభం కానున్నట్టు డీఈవో శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సెప్టెంబర్ 22 నుంచి 28 వరకు థియరీ పరీక్షలు ఉంటాయని, అక్టోబర్ 6 నుంచి 13 వరకు ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గతంలో అడ్మిషన్ తీసుకుని పరీక్షలకు హాజరుకానీ వారు, పరీక్షలకు హాజరై ఫెయిల్ అయిన వారు ఈ పరీక్షలు రాసేందుకు అర్హులని చెప్పారు. మరిన్ని వివరాలకు ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్ వెంకటస్వామి 8008403635 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

తండ్రి జ్ఞాపకార్థం మద్దూరు జీపీకి ఫ్రీజర్

మద్దూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తమ తండ్రి జ్ఞాపకార్థం కుమారులు మద్దూరు జీపీ కార్యాలయానికి శుక్రవారం ఫ్రీజర్‌ను అందించారు. పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లు మాట్లా డుతూ.. మద్దూరు గ్రామానికి చెందిన సోదరులు శనిగరం బాలకృష్ణ, శనిగరం భిక్షపతి తమ తండ్రి సాయిలు జ్ఞాపకార్థం గ్రామస్థులకు ఉపయోగపడేలా ఫ్రీజర్‌ను అందజేసినట్టు తెలిపారు. దాతలకు గ్రామస్థుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

రాయపోల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్కల్ గ్రామానికి చెందిన కీర్తి స్వామి ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. కొడకండ్ల గ్రామానికి చెందిన ఎక్సైజ్ ఎస్ఐ సలీం తన కొడుకు బర్త్‌డే సందర్భంగా శుక్రవారం మృతుడి కుటుంబానికి ఒక నెలకు సరిపోయే నిత్యావసర వస్తువులు, రూ. 5వేలు తన కొడుకు చేతుల మీదుగా అందజేశారు.

పేద విద్యార్థులకు బ్యాగ్‌లు, పెన్నులు పంపిణీ

తొగుట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి); తొగుట మండలం కానుగల్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు శుక్రవారం సామాజిక సమరసత వేదిక మరియు యూత్ ఫర్ సేవ వారి ప్రోద్బలంతో చేతన గ్రామీణ వికాస్ సేవాసమితి అందే వారి సహకారంతో 60 మందికి ఉచితంగా బ్యాగులు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చేతన గ్రామీణ వికాస సేవాసమితి సభ్యులతో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

కుకునూరుపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లి మండల ప్రత్యేక అధికారి స్వరూపరాణి శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందితో మాట్లాడుతూ వర్షాలు పడుతున్న వేళ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి రోగులకు మెరుగైన చికిత్స అందించాలని ఆమె సూచించారు.

ఆత్మ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకారం

చేర్యాల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): చేర్యాల డివిజన్ ఆత్మకమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు, సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. జనగామ డీసీసీ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి పాలకవర్గానికి అభినందనలు తెలిపారు.

బాధితులను ఆదుకోవాలి: సీపీఐ

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతులను, ప్రజలను యుద్ధ ప్రాతిపదికన ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ హైమావతికి వినతి పత్రం సమర్పించారు.

వర్షం తెచ్చిన కష్టాలు



సిద్దిపేటలో బురదమయంగా మారిన గోశాల



మిరుదొడ్డి: ఇటీవల వర్షాలకు లక్ష్మీనగర్ గ్రామంలో శుక్రవారం పూర్తిగా కూలిన పబ్బతి సులోచన ఇల్లు



కొమురవెల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఆవరణలో నిల్వ ఉన్న వర్షపు నీటిలో నుంచే శుక్రవారం పాఠశాలకు వస్తున్న విద్యార్థులు



సిద్దిపేటలో ఓ సెల్లార్ నుంచి వర్షపు నీటిని పంపుతో బయటకు పంపుతున్న దృశ్యం



సిద్దిపేట పట్టణంలోని ఓ భవనం సెల్లార్‌లోకి చేరిన వర్షపు నీరు



సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్ రైల్వే బ్రిడ్జి కింది నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

పలుచోట్ల ఘనంగా క్రీడాదినోత్సవం



సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రీడా దినోత్సవ ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జన్మదినం సందర్భంగా సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు జాతీయ క్రీడా దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక, వ్యక్తిత్వ వికాసంతో పాటు శారీరక దృఢత్వం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ దరిపల్లి నగేష్, సీనియర్ అధ్యాపకులు సుధాకర్ రెడ్డి, దేవయ్య, స్టూడెంట్ కౌన్సిలర్ కనక చంద్రం తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సిద్దిపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడాదినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి జీవన్ కుమార్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్వేత, అధ్యాపకులు పాల్గొన్నారు.

● **సిద్దిపేట రూరల్:** క్రీడలు విద్యార్థులకు కేవలం గెలుపు ఓటమి కోసమే కాదని జీవిత పాఠాలు నేర్పుతాయని ఎంఈవో గౌరి మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం నారాయణరావుపేట మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గ్రామ ప్రభుత్వ ఉపాధ్యాయుడు దొంగల గోవర్ధన్ రెడ్డి సహకారంతో స్పోర్ట్స్ డ్రెస్‌లు పంపిణీ చేశారు.

● **వర్గల్ :** వర్గల్ మండలం నెంటూర్ విశ్వశాంతి హైస్కూల్‌లో మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినోత్సవం సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు 3కే రన్ నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రొ కబడ్డీ కామెంట్రేటర్ డాక్టర్ మాధవి బండారి, బేగంపేట ఎస్ఐ మహిపాల్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం నెంటూర్ నుంచి ప్రారంభమైన 3కే రన్ మాలపల్లి నుంచి పాఠశాల వరకు నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.



వర్గల్: నెంటూర్‌లో 3 కే రన్‌లో పాల్గొన్న విద్యార్థులు

వర్షాలు తగ్గిన తరువాతే ఎరువులు చల్లుకోవాలి: డీఏవో

కుకునూరుపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వర్షాలు తగ్గిన తర్వాతే పంటలకు ఎరువులు వేయాలని సిద్దిపేట జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపరాణి రైతులకు సూచించారు. శుక్రవారం కుకునూరుపల్లి గ్రామంలో పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ అధిక వర్షాలకు పత్తి పంట దెబ్బతినే అవకాశం ఉన్నందున వర్షాలు తగ్గిన తర్వాత ఎకరాకు 25 కిలోల యూరియా మరియు 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ చెరువులను పంట మొదలులో వేసుకోవాలని సూచించారు.

● **గజ్వేల్/రాయపోల్:** రైతులు వెంటనే పంటల సస్యరక్షణ చర్యలు చేపట్టాలని గజ్వేల్ వ్యవసాయ శాఖ ఏడీ బాబునాయక్ సూచించారు. శుక్రవారం గజ్వేల్ మండలంలోని సింగాటంలో వర్షాలకు నీట మునిగిన పంటలను పరిశీలించారు. పంట పొలాల నుంచి వెంటనే వాన నీటిని తొలగించాలన్నారు. గజ్వేల్ మండల పరిధిలో 643 ఎకరాల్లో వరిపంట, 300 ఎకరాల్లో పత్తి పంట నష్టపోయినట్టు తెలిపారు. రాయపోల్ మండలంలో కురిసిన భారీ వర్షాలకు సుమారు 200 ఎకరాలకు పైగా వరి, 50 ఎకరాలకు పైగా పత్తి పంట నష్టమైనట్లు ప్రాథమిక అంచనా వేశామని రాయపోల్ మండల వ్యవసాయ అధికారి నరేష్ పేర్కొన్నారు.

కోహెడ పీఎస్‌ను సందర్శించిన ఏసీపీ

కోహెడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కోహెడ పోలీస్‌స్టేషన్‌ను హుస్నాబాద్ ఏసీపీ సదానందం శుక్రవారం సందర్శించారు. స్టేషన్ పరిసర ప్రాంతాలను, రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మండలంలోని బస్వాపూర్ గ్రామంలో సోలార్ సిస్టంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. సీసీ కెమెరాలకు సహకరించిన గ్రామస్తులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, కోహెడ ఎస్ఐ అభిలాష్, ఏఎస్ఐలు బాల గంగాధర్ తిలక్, కనకయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలి

మద్దూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సంఘాల సహాయకులు ప్రాజెక్ట్ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని ఏపీఎం ప్రకాశం సూచించారు. శుక్రవారం మండలకేంద్రంలోని జాగృతి కార్యాలయంలో వీవోఏలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వీవోఏలు కొత్త ఎస్‌హెచ్‌జీలు ఏర్పాటు చేయడంతో పాటుగా దివ్యాంగులు, వృద్ధ మహిళల సంఘాల ఏర్పాటుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీసీలు ప్రేమలత, మహేందర్, నర్సయ్య, యాదగిరి ఉన్నారు.

భారీ వర్షం.. తీరని నష్టం

(5వ పేజీ తరువాయి)

రోడ్డులోని పలు దుకాణాలు, హోటళ్లలోకి నడుము లోతు వరకు నీరు చేరి బురదమయంగా మారాయి. దుకాణాల్లోని ఫర్నిచర్‌ను బయటపెట్టి శుభ్రం చేస్తున్నారు. పలు అపార్ట్‌మెంట్లలోని సెల్లార్లలో వాహనాలు ఇంకా వరద నీటిలోనే ఉన్నాయి.

రెండు రోజుల్లో పనులు పూర్తి చేస్తాం

వరద ప్రభావంతో లోతట్టు ప్రాంతాల్లోని పలు కాలనీలు బురదమయంగా మారాయి. వరద తగ్గిన తర్వాత చర్యలు చేపట్టి రెండు, మూడు రోజుల్లో పనులు పూర్తి చేస్తాం. నీరు నిల్వ ఉండకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీలోకి వెళ్లేలా చూడాలని అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశాం. సిబ్బంది పలు కాలనీల్లో బ్లీచింగ్ చల్లి, డ్రైనేజీని శుభ్రం చేస్తున్నారు. ఇలాంటి విపత్కర సమయంలో ప్రజలు కూడా సహకరించాలి.

-ఆశ్రిత్ కుమార్, మున్సిపల్ కమిషనర్, సిద్దిపేట

మెరుపుకుంటకు, తుంగచెరువుకు గండ్లు



నంగునూరు: ముండ్రాయిలోని గండిపడ్డ మెరుపుకుంట

నంగునూరు/తొగుట ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నంగునూరు మండలం ముండ్రాయి గ్రామంలోని మెరుపుకుంట చెరువుకు శుక్రవారం గండి పడింది. తహసీల్దార్ సరిత అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. నీటిపారుదల శాఖ ఏఈ రాజు, ఇతర అధికారులతో కలిసి ఇసుక బస్తాలు అడ్డుగా వేసి గండిని తాత్కాలికంగా పూడ్చివేశారు. ఎక్కడైనా చెరువులు, కుంటలు తెగిపోయే పరిస్థితి ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. తొగుట మండలంలో భారీ వర్షాలకు లింగాపూర్, జప్తిలింగారెడ్డిపల్లి, చందాపురం, వెంకట్రావుపేట గ్రామాల్లో పంటలు నీటమునిగాయి. జప్తిలింగారెడ్డిపల్లి గ్రామ శివారులోని తుంగచెరువుకు గండి పడడంతో రోడ్డుపై నుంచి నీరు ప్రవహించి గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. దుబ్బాక ఆత్మకమిటీ చైర్మన్ గాంధారి నరేందర్‌రెడ్డి, తొగుట తహసీల్దార్ శ్రీకాంత్, సీఐ లతీఫ్, ఎస్ఐ రవికాంత్‌రావు, ఇరిగేషన్ ఏఈ ఆస్మాలు పరిస్థితిని సమీక్షించారు. టిప్పర్‌లతో మట్టిని తీసుకువచ్చి జేసీబీల సహకారంతో తాత్కాలికంగా గండిని పూడ్చే పనులను చేపట్టి రాకపోకలను పునరుద్ధరించారు. మండలంలో సుమారు 10 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు.



తొగుట: జప్తిలింగారెడ్డిపల్లిలోని తుంగచెరువుకు గండిపడి కోసుకుపోయిన రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

చిగురిస్తున్న ఆశలు

(5వ పేజీ తరువాయి)

కరుణించలేదు. హుస్నాబాద్, కోహెడ, బెజ్జంకి, అక్కన్నపేట, మద్దూరు మండలాల్లో 1,60,612 ఎకరాల సాగుకు యోగ్యమైన భూమి ఉండగా, గత ఖరీఫ్‌లో 1.10 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుతం 1.05 లక్షల ఎకరాల్లో సాగయ్యింది. జూన్‌లో వర్షాలు ఆలస్యంగా రావడంతో పత్తి పంట వేయడానికి అవకాశం దొరకలేదు. దీంతో రైతులు వరి వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం హుస్నాబాద్ వ్యవసాయ డివిజన్‌లోని హుస్నాబాద్, అక్కన్నపేట, బెజ్జంకి, కోహెడ మండలాల్లో ఇప్పటి వరకు వరి 62,919, పత్తి 24,528, మొక్కజొన్న 4,264, కందులు 669 ఎకరాల్లో సాగవుతోంది.

నిండుకుండలా శనిగరం ప్రాజెక్టు

హుస్నాబాద్ డివిజన్‌లో ఉన్న ఒక టీఎంసీ సామర్థ్యం గల శనిగరం ప్రాజెక్టు ప్రస్తుతం నిండుకుండలా మారింది. ప్రాజెక్టు కింద 5,100 ఎకరాల ఆయకట్టు ఉండగా ప్రస్తుతం నాట్లు వేశారు. 0.32 టీఎంసీ సామర్థ్యం ఉన్న బెజ్జంకి మండలం తోటపల్లి వరద కాలువ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు అలుగు పారుతోంది. అలాగే 1800 ఎకరాల ఆయకట్టు ఉన్న హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువులో ప్రస్తుతం 50 శాతం వరకు నీరు ఉంది. ఈ చెరువు కింద భూముల్లో ఇప్పటికే నాట్లు వేశారు.

ఘనంగా తెలుగుభాషా దినోత్సవం



వర్గల్ మహాత్మా జ్యోతిబాపూలేలో శ్రీకృష్ణదేవరాయల ఏకపాత్రాభినయం చేసిన శైలజను అభినందిస్తున్న అధ్యాపకులు



చేర్యాల: అర్జునపట్ల జడ్పీఎస్ఎస్ ఆవరణలో తెలుగు కవుల వేషధారణలో విద్యార్థుల ప్రదర్శన



సిద్దిపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సిద్దిపేట కల్చరల్/ వర్గల్/చేర్యాల/మిరుదొడ్డి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు కవి గిడుగు వెంకటరామమూర్తి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లాలోని పలు విద్యాసంస్థల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలలు, పాఠశాలల్లో గిడుగు రామమూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలుచోట్ల తెలుగుకవుల వేషధారణతో విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. సిద్దిపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో గిడుగు రామూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి జీవన్ కుమార్ మాట్లాడుతూ గ్రాంథిక భాష కాకుండా ప్రజల వ్యవహారిక భాషను సాహిత్యానికి, విద్యకు అన్వయింపజేసిన మహనీయుడు గిడుగు వెంకట రామూర్తి అని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్వేత, అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు. వర్గల్‌మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే మహిళా డిగ్రీకళాశాలలో విద్యార్థినులు పాటలు, ఉపన్యాసాలతో తెలుగుభాషా ప్రాముఖ్యాన్ని తెలియజెప్పారు. శైలజ అనే విద్యార్థిని శ్రీ కష్ణదేవరాయల ఏకపాత్రభినయంతో ఆహూతులను అలరించింది. కార్యక్రమం అనంతరం శైలజాను కళాశాల బృందం అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం భాస్కర్, వైస్ ప్రిన్సిపాల్ గోవిందరావు, ఏటీపీ వర్షిని, డీడబ్ల్యు జయలక్ష్మీ, తెలుగు అధ్యాపకులు లావణ్య, మృణాళిని, స్వాతి ప్రసాదంతో పాటు అధ్యాపక బృందం, విద్యార్థులు పల్గొన్నారు. చేర్యాల మండలంలోని అర్జునపట్ల జడ్పీఎస్ఎస్‌లో విద్యార్థులు తెలుగు కవుల వేషధారణతో చేసిన ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా తెలుగు భాషా ప్రాముఖ్యాన్ని వివరిస్తూ, మాతృభాషను విస్మరించకూడదని చాటిచెప్పారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మాతృభాషను ప్రతిఒక్కరూ గౌరవించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, బాలకృష్ణ, రాజేశ్వరీ,ఇందిరా, సరితా,నవిత ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 25 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం ఆగస్ట్ 29 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 25మంది పట్టుబడ్డారు. వారిని శుక్రవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట కోర్టులో హాజరుపరచగా నిందితులకు రూ.46,500 జరిమానా విధించారు.

అంగడి కిష్టాపూర్ ఉపాధ్యాయులకు సన్మానం



టీఎల్ఎం మేళాలో ప్రథమ స్థానంలో నిలిచిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పాఠశాల డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్, ఉపాధ్యాయ బృందం

మర్కుక్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): టీఎల్ఎం మేళాలో రెండు ప్రథమ బహుమతులు సాధించిన మర్కుక్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల అంగడికిష్టాపూర్ ఉపాధ్యాయులు సంతోషిమాత హారికలను పాఠశాల డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ మాజీ సర్పంచ్ రాములగౌడ్ ఘనంగా సన్మానించారు. శుక్రవారం నేషనల్ స్పోర్ట్స్‌డే, తెలుగు భాష దినోత్సవం సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలకిషన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు.

సీఎంను కలిసిన యూత్ కాంగ్రెస్ నాయకులు



మెదక్‌లో సీఎంతో వర్గల్ మండల యూత్ కాంగ్రెస్ నాయకులు

వర్గల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంత పర్యటనలో భాగంగా శుక్రవారం మెదక్ ఎస్పీ కార్యాలయంలో ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించడానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డిని శుక్రవారం యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చెట్టిపల్లి అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ నాయకులు కలిశారు. సిద్దిపేట జిల్లాలో వర్షం వలన తీవ్ర స్థాయిలో పంటలు, ఆస్తి నష్టం జరిగిందన్నారు. వారందరిని ప్రభుత్వం తరపున ఆదుకోవాలని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు అనిల్‌రెడ్డి తెలిపారు. వెంట యూత్ కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్ యాదవ్, నందకుమార్, తదితరులు ఉన్నారు.

రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం



సింగాటం పునరావాస కేంద్రంలో బాధితులకు దుప్పట్లను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వర్షంతో పంటలను నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్ మండలంలోని బెజుగామ చెరువు కట్టను పరిశీలించిన అనంతరం సింగాటం గ్రామంలో ముంపునకు గురైన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు చెందిన 74మందిని ఆయన పరామర్శించి వారికి దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... చెరువుకు గండి పడకుండా కాపాడిన గ్రామస్థులను ఆయన అభినందించారు. పంటలను నష్టం సర్వేను వ్యవసాయ శాఖ అధికారులు చేపట్టారని, త్వరలోనే బాధిత రైతులకు నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో రైతాంగానికి యూరియా పాపం బీజేపీదేనని, ఆ పార్టీ ఎంపీలు, కేంద్ర మంత్రులు పట్టించుకోవడం లేదన్నారు. వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, నాయకులు తదితరులున్నారు.

బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

● **గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి**

గజ్వేల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): బాధిత రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. గజ్వేల్ మండలం అక్కారం మధిర గ్రామమైన కోనాపూర్‌లో తెగిపోయిన పెద్దచెరువు కట్టను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెద్ద చెరువు కట్ట తెగిపోవడంతో రైతులు ఎన్నో అప్పులు చేసి సాగు చేస్తున్న వరిపంటను నష్టపోయారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన పంటలను సర్వే నిర్వహించి ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే బండ్‌కు మరమ్మతులు చేయించాలన్నారు.

● **జగదేవ్‌పూర్,:** మండలంలోని అనంతసాగర్‌లో డెంగ్యూ వ్యాధితో మృతి చెందిన యశ్వంత్ కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రతాప్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిమ్మాపూర్‌లో ఇప్పటికే ఇద్దరు డెంగ్యూ వ్యాధితో చనిపోగా అధికారులు మొక్కుబడి చర్యలు చేపట్టారని, అందువల్లే యశ్వంత్ చనిపోయాడని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తిమ్మాపూర్ అనంతసాగర్ గ్రామాల్లో పారిశుధ్య పనులు మెరుగుపరిచి డెంగ్యూ నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

గణపయ్య సన్నిధిలో సామూహిక కుంకుమార్చన



సిద్దిపేట టెలికాంనగర్ కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన గణనాథుడి మండపంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

సిద్దిపేట కల్చరల్/చేర్యాల/హుస్నాబాద్ టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా వినాయక నవరాత్రులు కనుల పండువగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు శుక్రవారం వివిధ మండపాల్లో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. పట్టణంలోని టెలికామ్ నగర్ కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గణపయ్య సన్నిధిలో మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అదేవిధంగా పట్టణంలోని ఎక్స్‌ట్రీమ్ జిమ్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద శుక్రవారం గణనాథుని మండపంలో మహిళలు కుంకుమార్చన చేశారు. గణపతి నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం చేర్యాల పట్టణంలోని వైశ్యభవన్‌లో ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన కన్నులపండువగా నిర్వహించారు. మహిళలు గణపతితో పాటు అమ్మవారిని స్మరిస్తూ కుంకుమాభిషేకం జరిపారు.హుస్నాబాద్ పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌లో గణపతి నవరాత్రుల సందర్భంగా సుమారు వంద మంది మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.

నేడు వివిధ పార్టీలతో సమావేశం

కుకునూరుపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు, ఓటరు ముసాయిదా, పోలింగ్ కేంద్రాలు తదితర అంశాలపై అన్ని పార్టీలతో శనివారం ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్టు కుకునూరుపల్లి మండల ఇన్‌చార్జి ఎంపీడీవో రాంప్రసాద్ తెలిపారు.